క్లుప్తంగా

ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



చింతలచెరువు తేజు

హాలియా : సూర్యాపేట జిల్లా నడిగూడెంలో ఈనెల 16, 17వ తేదీల్లో జరగబోయే అండర్‌–14 విభాగం ఉమ్మడి జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫుట్‌బాల్ పోటీలకు హాలియా పట్టణానికి చెందిన విద్యార్థి చింతలచెరువు తేజు ఎంపికయ్యారు. తేజు చందూరులోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నట్లు ఆ పాఠశాల ప్రిన్స్‌పాల్, కోచ్ లింగ్యానాయక్ బుధవారం తెలిపారు. క్రీడల్లో మంచి ప్రతిభ కనబర్చి రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో రాణించడంతో పాటు పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకరావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థి తేజును తల్లిదండ్రులు, స్థానికులు అభినందించారు.

ఓటమి భయంతోనే బీజేపీ నాయకులపై దాడులు

త్రిపురారం : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే బీజేపీ నాయకులపై దాడులకు దిగుతున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తూ బుధవారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ నాయకులపై దాడులకు దిగిన వారిని పోలీసులు అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కటకం మల్లికార్జున్, మండల ప్రధాన కార్యదర్శి మేదరి సైదులు, గోవింద్, కిలారి సైదులు, కడియం సైదులు, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు కెతావత్ రమేష్ నాయక్, లోకేష్ నాయక్, సర్దార్ నాయక్, రాగం నాగరాజు, లచ్చు నాయక్, శ్రీను పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

నాగార్జునసాగర్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డిపై జరిగిన దాడికి నిరసనగా నందికొండ మున్సిపాలిటీ హిల్‌కాలనీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం బీజేపీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. జెండాలతో నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో తంగరాజు గణేష్(చిన్ని) పాల్గొన్నారు.

ఓటరు స్లిప్‌లు అందజేయాలి

చింతపల్లి : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లోని ప్రతి ఓటరుకు బూతు స్థాయి అధికారులు ఓటరు స్లిప్‌లు అందజేయాలని తహసీల్దార్ శంషొద్దీన్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు ఓటరు స్లిప్‌లను అందజేసి మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామంలో బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు స్లిప్ కార్డులను అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌ఐ యాదయ్య, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

చింతపల్లిలో నిలిచిన ధరణి రిజిస్ట్రేషన్లు

- అధికారులు ఎన్నికల విధుల్లో ఉండడమే కారణం

చింతపల్లి : చింతపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వారం రోజుల నుంచి ధరణి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. అధికారులు ఎన్నికల విధుల్లో ఉండడంతో స్లాట్ బుక్ చేసుకున్న వారికి ఇబ్బందులు తప్పడం లేదు. వారం రోజుల నుంచి భూములు విక్రయించిన వారు, ఇతర ప్రాంతాల నుంచి స్లాట్ సమయానికి కార్యాలయానికి వస్తూ సాయంత్రం వరకు అధికారుల కోసం వేచి చూసి చేసేది లేక వెనుదిరుగుతున్నారు. స్లాట్ బుకింగ్ అవుతున్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేసేందుకు అధికారులు రాకపోవడంతో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు.

బీఆర్‌ఎస్ పార్టీలో చేరిక



మిర్యాలగూడలో కండువాలు కప్పి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న సిద్ధార్థ

మిర్యాలగూడ: పట్టణంలోని ఈదులగూడెం గ్రామానికి చెందిన బుడిగె జంగాల కులస్తులు 20 కుటుంబాలు బీఆర్‌ఎస్ వార్డు ఇన్‌చార్జి బొడ్డు నందకిశోర్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం బీఆర్‌ఎస్ యువ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ ఎన్నికల్లో నల్లమోతు భాస్కర్‌రావు గెలుపుకు కృషి చేయాలని కోరారు. ఇంటింటికి వెళ్లి బీఆర్‌ఎస్ పథకాలను, మానిఫెస్టోను ప్రజలకు వివరించాలని ఆయన కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో ఎలుగుబెల్లి నాగరాజు, చల్లా వెంకన్న, బంటు శ్రీను, నరేష్ పాల్గొన్నారు.

ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి

మాడ్గులపల్లి: ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నిమ్మల నవీన్‌రెడ్డి కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో హామీల్లో స్పష్టత కరువైందని అన్నారు. మండలంలోని ఇసుకబావిగూడెంలో వేములపల్లి పీఏసీఎస్ చైర్మన్ రాములుగౌడ్‌తో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. బూటకపు హామీలతో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ యత్నిస్తోందని ఆరోపించారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

- మిర్యాలగూడ, సాగర్, దేవరకొండ నియోజకవర్గాల్లో ఎన్నికల బరిలో నిలిచిన 51మంది అభ్యర్థులు

మిర్యాలగూడ : అసెంబ్లీ సాధారణ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం బుధవారం ముగిసింది. మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి మొత్తంగా 45 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా 12మందివి వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 33మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు అధికారులు తేల్చారు. చివరి రోజు పది మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. కాగా, రిటర్నింగ్ కార్యాలయంలో జరుగుతున్న నామినేషన్ల తుది జాబితా ప్రక్రియను ఎన్నికల జనరల్ అబ్జర్వర్ అవినాశ్ చంపత్, వ్యయ పరిశీలకుడు డీఎం.నింజేలు పరిశీలించారు.

మిర్యాలగూడ బరిలో 23మంది అభ్యర్థులు

మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల బరిలో 23మంది ఉన్నట్లు ఆర్‌ఓ చెన్నయ్య తెలిపారు. వారిలో జూలకంటి రంగారెడ్డి (సీపీఎం), నల్లమోతు భాస్కర్‌రావు (బీఆర్‌ఎస్), బత్తుల లక్ష్మారెడ్డి (కాంగ్రెస్), సాధినేని శ్రీనివాస్‌రావు (బీజేపీ), అశోక్‌రెడ్డి (జనశంఖారావం పార్టీ), కోల సైదులు(ప్రజావాణి పార్టీ), వస్కుల గోపి (ఎంసీపీఐయూ), తరి ఎల్లయ్య (ధర్మసమాజ పార్టీ), దేవులపల్లి కార్తీక్‌రాజ్(నవంగ్ కాంగ్రెస్ పార్టీ), నందిపాటి జానయ్య (తెలంగాణ సకలజనుల పార్టీ), వజ్జగిరి పెద్ద అంజయ్య(బహుజన ముక్తి పార్టీ), బొడ్డు వెంకటేశ్వర్లు (భారత చైతన్య యువజన పార్టీ), కుకుడాల మనోజ్‌కుమార్ (విద్యార్థుల రాజకీయ పార్టీ), మామిడి సైదయ్య (డీఎస్‌పీ), బి.రుక్మిణి నాయక్ (జై మహా భారత్ పార్టీ), జక్కుల నర్సింహ సీపీఐ(మార్క్సిస్ట్–లెనినిస్ట్) రెడ్ స్టార్), గిరిబాబు కుక్కల (స్వతంత్ర), చిట్టిపోలు సురేందర్ (స్వతంత్ర), పానుగోతు లాల్‌సింగ్ (స్వతంత్ర), వనం విజయ్ కుమార్(స్వతంత్ర), వనం విజయ్ కుమార్ (స్వతంత్ర) అభ్యర్థులు పోటీలో ఉన్నారని ఎన్నికల అధికారి శ్రీనివాస్ తెలిపారు.



నిడమనూరు : నామినేషన్ ఉపసంహరించుకుంటున్న స్వతంత్ర అభ్యర్థి గాదె సైదిరెడ్డి

బంటు రవి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), స్వతంత్ర అభ్యర్థులుగా గున్‌రెడ్డి జనార్దన్‌రెడ్డి, పగడాల ఎల్లయ్య, బారెడ్డి లక్ష్మారెడ్డి, బొలుసాని కృష్ణయ్య, మట్టపల్లి అంకాలమ్మ, మల్లిడి వెంకటరామారెడ్డి, మహేశ్వరం చిరంజీవి, సయ్యద్‌ఫారూఖ్, లావూరి సైదా ఉన్నారు.

సాగర్‌లో 15మంది..

నిడమనూరు: నాగార్జునసాగర్ అసెంబ్లీ నియోజకవర్గ బరిలో 15మంది అభ్యర్థులు నిలిచారు. ఎన్నికల్లో పోటీకి మొత్తంగా 28 నామినేషన్లు దాఖలయ్యాయి. వివిధ కారణాలతో ఏడుగురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురికాగా, ఆరుగురు అభ్యర్థులు బుధవారం తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని అధికారులు తెలిపారు.

బరిలో ఉన్న అభ్యర్థులు వీరే..

కంకణాల నివేదిత (బీజేపీ), కుందూరు జైవీర్ (కాంగ్రెస్), నోముల భగత్‌కుమార్ (బీఆర్‌ఎస్), లోకబోయిన వెంకటరమణ (బీఎస్‌పీ), అనిత మసున (అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ), అన్నపూర్ణ నకిరేకంటి (యుగ తులసి పార్టీ), కాశయ్య పోతుగంటి(ఎంసీపీఐ(మార్కిస్ట్)),

దేవరకొండలో 13మంది..

దేవరకొండ: త్వరలో జరుగనున్న ఎన్నికల్లో దేవరకొండ అసెంబ్లీ స్థానానికి 13మంది అభ్యర్థులు బరిలో ఉండనున్నారు. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం తుది జాబితా ఖరారైంది .కాగా స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులను సైతం కేటాయించినట్లు ఆర్‌వో శ్రీరాములు తెలిపారు. ఈనెల 3వ తేది నుండి 10వ తేది వరకు మొత్తం 18మంది అభ్యర్థులు 34సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం ఎన్నికల అధికారులు చేపట్టిన స్క్రూటినీలో వివిధ కారణాలతో 5నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. బుధవారం ఒక్కరు కూడా తమ నామినేషన్‌ను ఉపసంహరించు కోలేదు. వారిలో రమావత్ రవీంద్ర కుమార్ (బీఆర్‌ఎస్),నేనావత్ బాలునాయక్(కాంగ్రెస్),కేతావత్ లాలు నాయక్ (బీజేపీ), ముఢావత్ వెంకటేష్‌చౌహాన్ (బీఎస్పీ), కేతావత్ బాబురాం(విద్యార్థుల రాజకీయపార్టీ), కొర్ర లక్పతి (సోషలిస్ట్‌పార్టీ), కేతావత్ రమేష్‌బాబు(టీఆర్‌పీ పార్టీ), ఇస్లావత్ కిషన్ (స్వతంత్ర), కేలావత్ వశ్య(స్వతంత్ర),రమావత్ గోపాలకృష్ణ(స్వతంత్ర),వడ్త్య శ్రీను(స్వతంత్ర), ముఢావత్ సీతారాం(స్వతంత్ర),గుగులోతు రవినాయక్(ధర్మసమాజ్‌పార్టీ)ల అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉండనున్నారు

ఎన్నికల నిబంధనలు పాటించాలి

దేవరకొండ: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీలో ఉండనున్న అభ్యర్థులు తప్పనిసరిగా కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని దేవరకొండ ఆర్‌ఓ శ్రీరాములు అన్నారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినేషన్ తేదీ నుంచి ప్రచార కార్యక్రమాలు ముగిసే వరకు అభ్యర్థులు ఎన్నికలకు చేసే ఖర్చులను ఎన్నికల వ్యయ పరిశీలకులు ఈనెల 19,23,28తేదీల్లో పరిశీలిస్తారని ఆయన పేర్కొన్నారు. పోటీల్లో ఉండే అభ్యర్థులు తమ రోజు వారీ ఖర్చుల రిజిస్టర్‌తో ఆయా తేదీల్లో విధిగా ఆర్డీఓ కార్యాయంలో హాజరుకావాలని కోరారు. ఎన్నికల నిబంధనలు ఉల్లఘించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న ఆర్‌ఓ శ్రీరాములు

ఎన్నికల వ్యయాన్ని పరిశీలన చేయించుకోవాలి

మిర్యాలగూడ : మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల కోసం చేసిన ఖర్చును (నామినేషన్ తేదీ నుంచి ప్రచార కార్యక్రమాలు ముగిసే వరకు) ఈనెల 19, 23, 28 తేదీల్లో ఎన్నికల వ్యయ పరిశీలకులు పరిశీలిస్తారని ఆర్డీఓ, ఆర్‌ఓ బి.చెన్నయ్య బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులు పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం 11.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సూచించిన తేదీల్లో హాజరై వారి ఎన్నికల ఖర్చుల రిజిస్టర్‌ను ఎన్నికల వ్యయ పరిశీలకులతో పరిశీలన చేయించుకోవాలని సూచించారు. లేనట్లయితే ఎన్నికల నియమావళి (ఆర్‌పీ యాక్ట్ 1951/యు/ఎస్ 10ఎ) ప్రకారం హాజరు కాని అభ్యర్థులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వ్యయ పరిశీలకుల ఎదుట హాజరుకావాలి

నిడమనూరు: సాగర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచార వ్యయ పరిశీలనకు ఈనెల 18, 22, 27 తేదీల్లో ఎన్నికల పరిశీలకుల ఎదుట హాజరు కావాలని ఎన్నికల అధికారి శ్రీనివాస్ తెలిపారు. నామినేషన్ పత్రాలు దాఖల చేసినప్పటి నుంచి ప్రచారం ముగిసే రోజు నాటికి ఎన్నికల ప్రచార ఖర్చు వివరాలు పరిశీలకులకు అందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అభివృద్ధికి పాటుపడాలి

చందంపేట : చందంపేట మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ నూన్సావత్ పార్వతి కోరారు. బుధవారం చందంపేట ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. అంతకుముందు ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వివనిపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాములునాయక్, పంచాయతీరాజ్ ఏఈ రాజు, ఏవో లక్పతి, ఎంపీఓ జానయ్య పాల్గొన్నారు.

రామానుజాచార్యులు జీవితం ఆదర్శనీయం

మిర్యాలగూడ : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దివంగత రామానుజాచార్యులు జీవితం ఆదర్శనీయమని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, బీఆర్‌ఎస్ యువ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ అన్నారు. బుధవారం పట్టణంలోని బృందావన్‌గార్డెన్స్‌లో జరిగిన రామానుజాచార్యులు పరమ పదోత్సవం కార్యక్రమానికి వారు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. విద్యారంగంతోపాటు సామాజికరంగంలో ఎనలేని సేవలు అందించిన రామానుజాచార్యులు భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. సమాజ అభివృద్ధి కోసం నిరంతరం పరితపించే వారని ఆయన సేవలను కొనియాడారు. ఆయన వెంట డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కుందూరు వీరకోటిరెడ్డి, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



రామానుజాచార్యులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

కలిసికట్టుగా మాదిగల సత్తా చాటుదాం



మాట్లాడుతున్న మారపాక నరేందర్

త్రిపురారం : కలిసికట్టుగా మాదిగల సత్తా చాటుదామని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మరపాక నరేందర్ మాదిగ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆ సంఘం సాగర్ నియోజక వర్గ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు మాదిగలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జరగబోయే ఎన్నికల్లో మాదిగ ఓట్లే ప్రధాన పార్టీల గెలుపోటములను నిర్ణయిస్తాయన్నారు. రాజకీయంగా మాదిగలను చైతన్యపర్చడానికి త్వరలో హాలియాలో నిర్వహించబోయే మాదిగల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీస్ సాగర్ నియోజక వర్గ అధ్యక్షుడు మొండికత్తి అశోక్, నిడమనూరు అధ్యక్షుడు బొజ్జ ఈసు, మార్క్ మాదిగ, మహేందర్, సైదులు, ఏలేశా, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ‘బుసిరెడ్డి’ ఆర్థికసాయం



పెద్దవూర: రామన్నగూడెంలో బాధితురాలికి నగదు అందిస్తున్న పాండురంగారెడ్డి



తిరుమలగిరి: బాధితుడు సైదులుకు నగదు అందజేస్తున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన యలకాని సైదులుపై గోడకూలి నడుములు విరిగిపోవడంతో మంచానికే పరిమితమయ్యాడు. దీంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో విషయం తెలుసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి బుధవారం అతడిని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అలాగే మండలంలోని బోయగూడెం గ్రామంలో ఇటీవల నిర్మించిన గంగమ్మ తల్లి దేవాలయానికి ఆయన ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు సాయం చేయడంలోనే నిజమైన ఆనందం లభిస్తుందని అన్నారు. తన ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రతి కుటుంబానికి ఏదో రకంగా సాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, నెల్లికల్లు సర్పంచ్ పమ్మి జనార్దన్‌రెడ్డి, గాలి నరేందర్‌రెడ్డి, మోహిన్‌పాషా, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర: ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న రామన్నగూడెం గ్రామానికి చెందిన తూళ్ల లక్ష్మయ్య, చలకుర్తి గ్రామానికి చెందిన పాతనబోయిన చంటి కుటుంబ సభ్యులకు బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి బుధవారం వారి ఇళ్లకు వెళ్లి ఆర్థిక సహాయం అందించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరిసాగర్ వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, నెల్లికల్లు సర్పంచ్ పమ్మి జనార్దన్‌రెడ్డి, మహేష్, నక్కల సమరసింహారెడ్డి, అంజి, కృష్ణ, గోవిందరెడ్డి, అయోధ్య, బ్రహ్మచారి, శివానందరెడ్డి, కోటేష్, లింగస్వామి, మధు, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించాలి : జానారెడ్డి

పెద్దవూర: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఈ ఎన్నికల్లో ఓడించాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో పెద్దవూర, గుర్రంపోడు మండలాల సీపీఐ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమావేశంలో సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, గడ్డంపల్లి భిక్షంరెడ్డి, వెంకటయ్య, రొయ్య రాములు, గార్లపాటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది

నాగార్జునసాగర్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని మాజీ మంత్రి, సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి ధీమావ్యక్తం చేశారు. పలువురు బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలతో పాటు ఎమ్మార్పీఎస్ ఉపకులాల రాష్ట్రనాయకుడు విష్ణుమూర్తి బుధవారం జానారెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో టీఎమ్మార్పీస్ చిత్రం శ్యాం ఉండగా కార్యక్రమంలో నాయకులు జంగయ్య, ఉంగరాల శ్రీను, ఆదాసు విక్రం,మందకిషోర్, పగిడి నర్సింహ, శ్రీను తదితరులు ఉన్నారు.

వీడియో క్లిప్పింగ్ చూపిస్తే పోటీ నుంచి తప్పుకుంటా

- కాంగ్రెస్ పార్టీ సాగర్ అభ్యర్థి జైవీర్‌రెడ్డి

నిడమనూరు: తన తండ్రి కుందూరు జానారెడ్డి బీఆర్‌ఎస్ కండువా కప్పుకుంటా అన్న వీడియో క్లిప్పింగ్ చూపిస్తే ఎన్నికల బరి నుంచి తప్పుకుంటానని కాంగ్రెస్ పార్టీ నాగార్జునసాగర్ అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి నోముల భగత్‌కు సవాల్ విసిరారు. బుధవారం నిడమనూరు మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కేసీఆర్, బీఆర్‌ఎస్ అభ్యర్థి హాలియా సభలో చెప్పింది నిజమైతే వీడియో క్లిప్పింగ్ చూపించాలన్నారు. ఉచిత విద్యుత్ నాలుగేళ్ల ఇస్తే బీఆర్‌ఎస్ కండువా కప్పుకుంటానని నాడు ప్రతిపక్ష నేత కుందూరు జానారెడ్డి అన్నారని సీఎం కేసీఆర్ మంగళవారం హాలియా ప్రజా ఆశీర్వాద సభలో వ్యాఖ్యానించడంపై జైవీర్‌రెడ్డి స్పందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నందికొండ రామేశ్వరి, మాజీ ఎంపీపీ యడవెల్లి రంగశాయిరెడ్డి, అంకతి సత్యం, కొండా శ్రీనివాసరెడ్డి, శివమారయ్య, నూకల వెంకట్‌రెడ్డి, అంకతి వెంకటరమణ, బొల్లం శ్రీనివాస్ యాదవ్, ప్రభాకరరెడ్డి, వల్లబరెడ్డి, వివేక్ కృష్ణ, మేరెడ్డి వెంకటరెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ పార్టీ ధ్యేయం

- అభివృద్ధిని చూసి ఎన్నికల్లో ఆదరించాలి
- మిర్యాలగూడ గులాబీ పార్టీ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ : పేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ మిర్యాలగూడ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లగా చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఆలోచించి ఓటేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బుధవారం దామరచర్ల మండలంలోని పలు గ్రామాలు, తండాల్లో బీఆర్‌ఎస్ ప్రగతియాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాస్కర్‌రావు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల ప్రజా జీవితంలో గిరిజనులతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. పేదల అభివృద్ధే ధ్యేయమని, అందులో భాగంగానే మారుమూల గ్రామాల్లో సీసీ రోడ్లు, బీటీరోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ సరఫరా తదితర అభివృద్ధి పనులు చేసానన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేర్చడం తన బాధ్యతగా భావించి కృషిచేశానని పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక కోట్ల నిధులు తీసుకువచ్చానని తెలిపారు. గిరిజనులకు పోడు భూముల పట్టాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మారుమూల గ్రామాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా కృష్ణాజలాలు అందించామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో అన్ని సంక్షేమ పథకాలను మళ్లీ ఏర్పడనున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కచ్చితంగా అమలు చేసి తీరుతామన్నారు. ప్రజల ఆదరాభిమానాలతో మరోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కారు గర్తుకు ఓటు వేసి తనను మూడోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఆంగోతు లలితహాతీరాం నాయక్, ఏఎంసీ చైర్మన్ బైరం బుచ్చయ్య, వైస్ చైర్మన్ వీరకోటిరెడ్డి, నాయకులు సైదులురెడ్డి, వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



దామరచర్ల మండలం కొత్తపేటతండాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు



ఎమ్మెల్యే భాస్కర్‌రావుకు హారతి ఇస్తున్న మహిళ

ప్రలోభాలకు లోను కావొద్దు

ప్రత్యర్థి పార్టీల ప్రలోభాలకు లోనుకావద్దని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన అడవిదేవులపల్లి మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు పొందిన వారిని గుర్తించి ఇంటింటికీ వెళ్లి స్వయంగా కలిసి వివరించాలని కోరారు. బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను ప్రతీ ఓటరుకు వివరించాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను అధిక మెజారిటీతో గెలిపించేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, జెడ్పీటీసీ సూర్యభాష్యనాయక్, పార్టీ మండల అధ్యక్షుడు కూరాకుల చినరామయ్య, వైస్ ఎంపీపీ కూరాకుల మల్లీశ్వరిగోపినాథ్, కుర్ర శ్రీను, కొత్త మర్రెడ్డి, సూర్యనాయక్, పాతులోతు బాలాజీనాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడలో కాషాయ జెండా ఎగరాలి

- కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ సహాయ మంత్రి శోభకరంద్లాజే

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడలో బీజేపీ జెండా ఎగిరేలా ప్రతి కార్యకర్త సైనికుడిలాగా పనిచేయాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి, ఆ పార్టీ నల్లగొండ జిల్లా ఎన్నికల పరిశీలకురాలు శోభకరంద్లాజే అన్నారు. బీజేపీ అభ్యర్థి సాధినేని శ్రీనివాస్‌రావును గెలిపించాలని కోరుతూ బుధవారం స్థానిక హనుమాన్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి రాజీవ్ చౌక్ మీదుగా ఈదులగూడెం చౌరస్తా వరకు రోడ్ షో నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 1200 మంది అమరుల త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబ పాలనతో లిక్కర్ రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. కేంద్ర పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి పేర్లు మార్చుకొని తానే అమలు చేశానని ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఆమె ఆకాంక్షించారు. సమావేశంలో పార్టీ నాయకులు బాణావత్ రతన్‌సింగ్ నాయక్, తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, కర్నాటి ప్రభాకర్, రేపాల పురుషోత్తంరెడ్డి, డాక్టర్ వెంకట్‌రెడ్డి, ఎడ్ల రమేష్, సీతారాంరెడ్డి, దొండపాటి వెంకటరెడ్డి, చిలుకూరి శ్యాం తదితరులున్నారు.



మిర్యాలగూడలో ఓటరును అభ్యర్థిస్తున్న కేంద్ర సహాయ మంత్రి శోభకరంద్లాజే

బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం



బాలునాయక్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాంచందర్‌నాయక్, తదితరులు

పెద్దవూర: సీఎం ప్రజా ఆశీర్వాద సభకు వెళ్లి ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పెద్దవూర మండలం సుద్దబావితండాకు చెందిన రమావత్ బాలునాయక్ కుటుంబాన్ని బీఆర్‌ఎస్ పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందని రాష్ట్ర ట్రికార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ తెలిపారు. బుధవారం జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డితో కలిసి బాలునాయక్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కడారి అంజయ్యయాదవ్, బాబూరావునాయక్, కర్ణ బ్రహ్మారెడ్డి, మండల అధ్యక్షుడు జటావత్ రవినాయక్, ఎస్‌కే బషీర్, ధనావత్ కాంతారావు తదితరులు ఉన్నారు.

బీసీ కుల గణన చేపడతామని ప్రకటించాలి

మిర్యాలగూడ టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదిరిగా తెలంగాణలోనూ బీసీ కుల గణన చేపడతామని అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోల్లో ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఒడిశా, రాజస్తాన్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బీసీ కుల గణన ప్రక్రియను ప్రారంభించడం హర్షణీయమన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ జనాభా ప్రాతిపాదికన రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కుల గణన చేపట్టకపోవడంతోనే తెలంగాణలో బీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ క్రైం : తొమ్మిది నెలల పాటు 217 మంది కానిస్టేబుళ్లకు మెస్ నడిపేందుకు టెండర్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్పీ అపూర్వరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ పట్టణంలోని డీటీసీలో ఈ నెల 19 నుంచి దరఖాస్తు ఫారాలు పొందాలని, 25లోపు టెండర్ దరఖాస్తు అందజేయాలని ఆమె సూచించారు. డిసెంబర్ 8న వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం డీటీసీ వైస్ ప్రిన్స్‌పాల్, డీఎస్పీ విఠల్ రెడ్డి 8712670210, సీఐ ఆదిరెడ్డి 8712670167 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే చీకట్లే

- బీఆర్‌ఎస్ అభ్యర్థి నోముల భగత్

గుర్రంపోడు : కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే చీకట్లేనని, మూడు గంటల కరెంటు కావాలా..24 గంటల కరెంటు కావాలా అని ప్రజలు ఆలోచించుకుని ఓటు వేయాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి నోముల భగత్ కోరారు. బుధవారం ఎన్నికల ఇన్‌చార్జి ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డితో కలిసి గుర్రంపోడు మండలంలోని జిన్నాయిచింత, తానేదార్‌పల్లి, ఘాశీరాంతండా, జూనూతుల, మక్కపల్లి, పార్లపల్లి, కాచారం, మైలాపురం చేపూరు, కోనాయిగూడెం, తెరాటిగూడెం, కొత్తలాపురం, మొసంగి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎంపీపీల ఫోరం మండల అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షకార్యదర్శులు గజ్జెల చెన్నారెడ్డి, రామగిరి చంద్రశేఖర్‌రావు, వైస్ ఎంపీపీ వజ్జ రామేశ్వరీ ధనుంజయ పాల్గొన్నారు.

మిర్యాలగూడలో ఎర్రజెండా ఎగరడం ఖాయం

- సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ: మిర్యాలగూడలో ఈ సారి ఎర్రజెండా ఎగరడం ఖాయమని సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందన్నారు. నీతి, నిజాయితీగా ఉంటూ ప్రజా సమస్యలపై చట్టసభల్లో ప్రజా గొంతుక వినిపించే అందరివాడిగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, చౌగాని సీతారాములు, సైదమ్మ, రాగిరెడ్డి మంగారెడ్డి, గోవింద్‌రెడ్డి, రామకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదు

- కాంగ్రెస్ అభ్యర్థి బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి : రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదని కాంగ్రెస్ దేవరకొండ అభ్యర్థి నేనావత్ బాలునాయక్ అన్నారు.బుధవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని నంభాపురం, పెద్దగుమ్మడం, చింతల్‌తండా, గడ్డమీదితండా, వద్దిపట్ల, పడమటితండా,పుట్టంగండి,పావురాలగట్టు, నక్కలపెంటతండా, అజ్మాపురం, మల్లాపురం, ఎర్కరగుంటతండాల్లో జిల్లా పరిషత్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ అలుగుబెల్లి శోభారాణిఏవీరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో దూదిపాల వేణుధర్‌రెడ్డి, జాల నర్సింహారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, యల్లయ్యయాదవ్, బోడ్యానాయక్, మధుసూదన్‌రెడ్డి, ధనమ్మఅంజనేయులు, నారాయణ, అంజయ్య, గురువయ్య, లాలు, తదితరులున్నారు.